
ఆరు గ్యారెంటీల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు 6లో..

విద్యార్థులు ఇష్టపడి చదివి ఫలితాలను సాధించాలి 6లో..

ముంచుకొస్తున్న గడువు

- ముున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి
- జిల్లాలో 55.97 శాతం మాత్రమే వసూళ్లు
- రాష్ట్రంలో టాప్ టెన్ జాబితాలో రాయికల్, కోరుట్ల మున్సిపల్స్
- జిల్లాలో వంద శాతం సాధించడంపై కృషి



జగిత్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ఆస్తి పన్ను వసూళ్లపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో గల ఐదు మున్సిపాలిటీలు పన్ను వసూ ళ్లలో పోటీ పడుతున్నాయి. పదకొండు నెలలుగా సగానికి కొద్దిగా అటు ఇటుగా మాత్రమే పన్ను వసూళ్లు అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం మేరకు పన్ను వసూళు చేయడానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. మార్చి నెలాఖరుతో ముగియనున్న 2023-24 ఆర్థిక సంవత్సరంలో వంద శాతం ఆస్తి పన్ను వసూళ్లు సాధించడమే లక్ష్యంగా అధికారులు ముందుకు వెళ్తున్నారు.

గత పద కొండు నెలలుగా రెండు మున్సిపాలిటీలు సుమారు ముప్పాతిక శాతం మేరకు వసూళ్లు చేయగా, మూడు మున్సిపాలిటీలు సగానికి కొద్దిగా అటు ఇటు మాత్రమే వసూళ్లు కాగా కేవలం కొన్ని వ్యవధిలో మరో సగం వసూళ్లు చేయడం గగనంగా మారింది. గతంలో రాష్ట్రంలోనే వంద శాతం పన్ను వసూళ్లు చేసిన జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలు నిలిచి ఉన్నతాధికారులచే ప్రశంసలు అందుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి మున్సి పాలిటీలు దృష్టి సారిస్తున్నాయి. ఇందులో ప్రస్తుతం జిల్లాలోని రాయి కల్, కోరుట్ల మున్సిపాలిటీలు తొలి, మలిస్థానంలో, జగిత్యాల మున్సిపాలిటీ చివరి స్థానంలో ఉన్నాయి. రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్ల లో అగ్రస్థానంలో ఉన్న మున్సిపాలిటీల జాబితాలో టాప్ టెన్‌లో రాయి కల్, కోరుట్ల బల్దియాలు చోటు సంపాదించుకున్నాయి.

ఇప్పటి వరకు అయిన పన్ను వసూళ్లు ...

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో అధి కారులు ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు వంద శాతం పన్ను వసూళ్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత నెలాఖరు వరకు జిల్లాలో దాదాపుగా సగం మాత్రమే పన్ను వసూళ్లు అయింది. అయితే ప్రస్తుత మాసంలో గత వారం రోజులుగా జరుగుతున్న పన్ను వసూళ్లను ఆ శాఖ ఉన్నతాధికారులు ఆన్ లైన్‌లో ప్రకటిస్తున్నారు. మున్సిపల్ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో కలిపి 134 వార్డుల్లో సుమారు 65,664 గృహాలున్నాయి. ఇందుకు గాను రూ. 2,578.26 లక్షల ఆస్తి పన్ను వసూళు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లాలో రూ. 1,286.9 లక్షల వసూళ్లు అయ్యాయి. జిల్లాలో రూ. 1,291.36 లక్షల బకాయిలున్నాయి. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు 55.976 శాతం పన్ను వసూళ్లు అయింది.

జిల్లాలో బకాయిలు రూ. 1,291.36 లక్షలు...

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగానూ రూ. 1,291.36 లక్షల పన్ను బకాయిలున్నాయి. ఇందులో జగిత్యాల మున్సిపాలిటీలో రూ. 832.32 లక్షలు, కోరుట్లలో రూ. 135.73 లక్షలు, మెట్‌పల్లిలో రూ. 228.15 లక్షలు, ధర్మపురిలో రూ. 62.63 లక్షలు, రాయికల్‌లో రూ. 32.53 లక్షల బకాయిలున్నాయి. ఈ నెలాఖరు లోపు వంద శాతం పన్ను వసూళ్లు చేయాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకు వెళ్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణ..

జిల్లాలోని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో ప్రతీ మున్సిపాలిటీలో రెవెన్యూ శాఖ పన్ను వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ జరు గుతోంది. జిల్లాలో వ్యాప్తంగా 32 బృందాలను ఏర్పాటు చేసి ఆస్తి పన్ను ప్రత్యేక వసూళ్ల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో జగిత్యాలలో 9 బృందాలు, కోరుట్లలో 7 బృందాలు, మెట్‌పల్లిలో 6 బృందాలు, రాయికల్‌లో 4 బృందాలు, ధర్మపురిలో 6 బృందాలను ఏర్పాటు చేశారు. పన్నుల వసూళ్లకు ప్రత్యేకంగా బిల్ కలెక్టర్లు పనిచేస్తున్నారు.

పన్నుల రూపకంగా వచ్చే డబ్బులను పాలకవర్గం సూచనల మేరకు అధికారులు వ్యయం చేస్తారు. రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు, విద్యుత్ దీపాలు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, పారి శుధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు కొనుగోలు, కాంట్రాక్టు కార్మి కులకు, ఉద్యోగులకు వేతనాల చెల్లింపు, వాహనాల మరమ్మతుల వంటి పనులకు పాలక వర్గం అనుమతితో కేటాయిస్తుంటారు. పన్నులు లక్ష్యం మేరకు వసూలు కాకుంటే మున్సిపాలిటీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వానికి చెందిన భవనాలు, ఖాళీ స్థలాల నుంచి నిర్ధేశించిన మేరకు పన్నులు వసూలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

రాయికల్ మున్సిపల్ టాప్..

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో ఈనెల 2వ తేదీ వరకు వసూళ్లు అయిన పన్నును ఆ శాఖ ఉన్నతాధికారులు ఆన్‌లైన్‌లో వెల్లడించారు. దీని ప్రకారం రాయికల్ మున్సిపాలిటీలో 5,017 గృహాలుండగా రూ. 121.28 లక్షల ఆస్తి పన్ను వసూళు చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ. 88.75 లక్షలు వసూళు చేసి 73.18 శాతం లక్ష్యాన్ని సాధించి టాప్ వన్‌లో నిలిచింది. ఇదే దారిలో కోరుట్ల మున్సిపాలిటీలో 18,011 గృహాలుండగా రూ. 490.25 లక్షల పన్నుకు గాను ఇప్పటి వరకు రూ. 354.52 లక్షలు వ సూళు చేసి 72.31 శాతం లక్ష్యాన్ని సాధించి జిల్లాలో టాప్ టూగా నిలిచింది. జగిత్యాల మున్సిపాలిటీలో 25,346 గృహాలుండగా రూ. 1,371.91 లక్షల పన్నుకు ఇప్పటివరకు రూ. 539.59 లక్షలు వసూళు చేసి 39.33 శాతం లక్ష్యాన్ని సాధించి చివరి స్థానంలో ఉంది. ధర్మపురి మున్సిపాలిటీలో 4,320 గృహాలుండగా రూ. 107.81 లక్షల పన్నుకు గాను ఇప్పటివరకు రూ. 45.18 లక్షలు వసూళు చేసి 41.91 శాతం లక్ష్యాన్ని సాధించింది. మెట్ పల్లి మున్సిపాలిటీలో 12,970 గృహాలుండగా రూ. 487.01 లక్షల పన్నుకు ఇప్పటి వరకు రూ. 258.86 లక్షలు వసూళు చేసి 53.15 శాతం లక్ష్యాన్ని సాధించారు.

వందశాతం లక్ష్యం పూర్తి చేస్తాము
దివాకర, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



జిల్లాలో వంద శాతం ఆస్తి పన్ను లక్ష్యం పూర్తి చేసే దిశగా పనిచేస్తున్నాము. జిల్లాలోని రాయికల్, కోరుట్ల మున్సిపాలిటీలు అధిక శాతం వసూలు చేసి ఇప్పటికే రాష్ట్రంలో టాప్ టెన్ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. వంద శాతం వసూళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాము. ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపి దిశా నిర్దేశం చేస్తున్నాము.

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సాధ్యమైనంత తొందరలో పరిష్కరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై పలువురు బాధితులు అందించిన వినతి పత్రాలను స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఇచ్చిన 50 దరఖాస్తులను ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను 30 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్ల మంజూరు, భూ సమస్యలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై అర్జీలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీఓలు మధు సుదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ హన్మంతరావు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య



అభివాదం చేస్తున్న సంఘ సభ్యులు

జగిత్యాల అర్బన్, మార్చి 4: పార్లమెంట్ ఎన్నికల లోపే మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని స్థానిక ఎస్‌వీఎల్‌ఆర్ గార్డెన్‌లో మున్నూరు కాపు సంఘ బాధ్యులు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా మున్నేరు కాపుల అభివృద్ధి కోసం, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో గత ప్రభుత్వానికి విన్నవించినా పట్టించు కోలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాన పార్టీల మెనిఫెస్టోలో పెట్టాలని విజ్ఞప్తి చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ మాత్రం తమను గెలిపిస్తే విజ్ఞప్తిని అమలుచేస్తామని పేర్కొందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతులు సమర్పించడం జరిగిందని, ప్రభుత్వం ఏర్పడి 80రోజులు గడిచిన నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలకు ముందే మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు సంఘ బాధ్యులు, కులబాంధవులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేద ప్రజల ప్రభుత్వం

ఎండపల్లి, మార్చి 4: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం ఎండపల్లి మండల కేంద్రంలో కొడుకు వంశీ కృష్ణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేర్చుతుందని అన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలని కమిషనర్‌కు వినతి

రాయికల్, ఫిబ్రవరి 4: రాయికల్ పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ 9వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సువర్ణ సోమవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. గత నెల రోజులుగా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు అడ్లూరికి ఆహ్వానం



అడ్లూరికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

పెగడపల్లి, మార్చి 4 : మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 9 వరకు జరుగనున్న మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు సోమవారం ఆలయకమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు గంగారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ కమిటీ సభ్యులతో కలసి ధర్మపురి క్యాంపు కార్యాలయానికి తరలి వెళ్లి మహాశివరాత్రికి పెగడపల్లి రాజన్నను దర్శించు కోవాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి పోచయ్య, నాయకులు ఒరుగల శ్రీనివాస్, కఠారి చంద్రశేఖర్ రావు, పార్థసారథి, రాములు గౌడ్, వెంకటేశం, వెంకట్‌రావు, కొమురెల్లి, సుధాకర్, కిషన్ పాల్గొన్నారు.

'గృహ జ్యోతి' పేద ప్రజలకు వరం లాంటిది
ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 4: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకం అనేది పేదింటి ప్రజలకు ఒక వరమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని ముది రాజ్‌వాడలో గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి రెండు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. తాజాగా ప్రతి పేదింటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని నియోజకవర్గంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యుత్ వినియోగించుకునే విషయంలో 200 యూనిట్ల వరకు ఎవరు కూడ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ధర్మపురి పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ స్థంభాలు అవసరం ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. ఇందు కోసం నిధులు మంజూరు చేయించి సమస్య పరిష్కరి స్తానని ఆయన తెలిపారు. ధర్మపురి పట్టణ ప్రజలకు తాగు నీరందించే విషయంలో నెలకొన్న సమస్య పరిష్కారానికి కలెక్టర్‌తో మాట్లాడామని పేర్కొన్నారు. ఇందు కోసం ఒక కోటి నిధులు కూడ కేటాయించినట్లు తెలిపారు. అతి త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడ అమలు చేస్తామన్నారు. మిగిలిన గ్యారెంటీ పథకాల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుక రావాలని కోరారు. రాబోవు కాలంలో ధర్మపురి పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ఆయన జీరో బిల్ అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ట్రాన్స్‌కో ఎస్ ఈ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్యాయ, కౌన్సిలర్లు నాగలక్ష్మి, జక్కు పద్మ, సంతోషి, అరుణ, పద్మ, ట్రాన్స్‌కో డీఈఈ రాజరెడ్డి, ఏడీఈ సింధూర్‌శర్మ, ఏఈఈ రవి పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ పట్టణానికే పరిమితం చేస్తాం : ఎమ్మెల్సీ



గుల్లపేట లో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

జగిత్యాలరూరల్, మార్చి 4 : మాస్టర్‌ప్లాన్‌ను పట్టణానికే పరిమితం చేస్తామని ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని రఘు రాముల కోట లోని నాగాలయ దేవాలయంలో ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేట గ్రామంలో ఇజి ఎస్ నిధులు రూ. 30 లక్షలతో చేపట్టిన బైపాస్ రోడ్డును ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నాగాలయ దేవాలయ నిర్మాణానికి కృషిచేస్తానని తెలిపారు. దేవాలయాల అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమ్యలక్ష్మణ్, ముదిగొండ శేఖర్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి ధర్మయ్య, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మల్యాల, మార్చి 4: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాల కోసం దరఖాస్తులు సమర్పించని వారు, మార్పులు చేసుకునే వారి కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో స్వాతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సేవా కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించడంతో ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీవో వాసవి, కార్యాలయ సిబ్బంది పాల్గొనగా ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

కొడిమ్యాల, మార్చి 4 : కరీంనగర్ ఎంపీ బీఆర్‌ఎస్ పార్టీ టిక్కెట్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కెటాయించినం దుకు సోమవారం రాత్రి మండల కేంద్రంలోని అంగడి బజారులో మండల బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తు టపాసులు కాల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో తెలంగాణ పక్షాన వినోద్‌కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తెనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పులి వెంకటేష్‌గౌడ్, మహేష్, ఆనందం, రాజేశం, వెంకటి, రాకేష్, చంద్రశేఖర్, రమేష్ ఉన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

మల్యాల, మార్చి 4: మండలంలోని తాటిపల్లిలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఫాతిమానగర్ అడోరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో స్వాతి, ఎస్సై అబ్దుల్ రహీం 30 మంది మహిళలకు సర్టిఫికెట్స్, మిషన్లు అందజేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వాసవి, ఎంపీటీసీ అనిత, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ దీప్తి, మాజీ సర్పంచ్‌లు జ్యోత్స్న, రజని, ఆనందరెడ్డి సంస్థ ప్రతినిధులు మర్రి మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, రూప, స్రవంతి, పద్మజ, సరిత, జమున, మౌనిక పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

కథలాపూర్, మార్చి 4 : మండలంలోని పోతారం శ్రీలొంకరామన్న జాతర పోస్టర్‌ను సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ ధర్మపురి జలంధర్, పులి హరిప్రసాద్ ఆవిష్కరించారు. మహాశివరాత్రి మరుసటి రోజున లొంకరామేశ్వరస్వామి జాతర నిర్వహించ డానికి ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ పాలెపు లతగణేశ్, శేఖర్, గడ్డం గంగాధర్, మామిడిపల్లి నరేశ్, కుల సంఘ పెద్దలు ఉన్నారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు
తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

రాయికల్, ఫిబ్రవరి 4: యువత వ్యసనాలకు బానిస కాకుండా తమ లక్ష్యాలను అధిరోహించాలని రాయికల్ తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం అన్నారు. రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో సోమవారం జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఖ య్యూం మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉ న్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కష్టపడాలని అన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు శతాధిక వయో వృద్ధుడు జైనలుద్దీన్ స్వాతంత్రోద్యమంలో తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు జైనులుద్దీన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, పాఠశాల చైర్మన్ మచ్చ గంగాధర్, డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది
మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు



గెలుపొందినవారికి ట్రోఫీలు అందజేస్తున్న అతిథులు

రాయికల్, ఫిబ్రవరి 4: క్రీడల వల్ల విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను సోమవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు తహసీల్దార్ ఖయ్యూం, జడ్పీటీసీ జాదవ్ అశ్వినిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం జాతీయ పతాకాన్ని, ఒలంపిక్స్ పతాకాన్ని ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ధృడత్వంతో పాటు మానసిక ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య, క్రీడలకు ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమని అన్నారు. అనంతరం క్రీడల్లోని విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన పిరమిడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బాలె జయశ్రీశేఖర్, అకాడమీ డైరెక్టర్ నిఖిల్ కుమార్, కౌన్సిలర్ కన్నాక మహేందర్, ప్రెస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు చింతకుంట సాయి కుమార్, సంయుక్త కార్యదర్శి గంగాధరి సురేష్, జేఏసీ సభ్యులు కిరణ్‌రావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని పురుగుల మందు డబ్బాతో మాజీ సర్పంచ్ నిరసన



పురుగుల మందు డబ్బా లాక్కుంటున్న పోలీసు

తిమ్మాపూర్, మార్చి4: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కార్యాలయం ఎదుట మన్నెంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేడి అంజయ్య పెండింగ్ బిల్లులు చెల్లించాలని పురుగుల డబ్బాతో నిరసన తెలిపాడు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తిమ్మాపూర్ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా మన్నెంపల్లి మాజీ సర్పంచ్ మేడి అంజయ్య పురుగుల మందు డబ్బాతో అక్కడికి వచ్చాడు. గమనించిన పోలీసులు పురుగుల మందు డబ్బా లాగేసుకుని అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరిగి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భార్య పుస్తెల తాడు కుదువపెట్టి, అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. దానితోనే కేంద్ర, రాష్ట్ర అవార్డులు తిమ్మాపూర్ మండలానికి వచ్చాయని అన్నారు. సొంత నిధులు ఖర్చుపెట్టి గ్రామాలను అభివృద్ధి చేస్తే ఇప్పటికీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరాడు. కొందరు మాజీ సర్పంచ్‌లు బిల్లులపై నిరసన తెలిపేందుకు వచ్చే అవకాశం ఉందని ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాళేశ్వరం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా ఎండపెల్లి మారుతి



ఎండపెల్లి మారుతి

కరీంనగర్ కల్చరల్, మార్చి 4: ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రసిద్ధ శైవక్షేత్రం కాళేశ్వర దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా ఎండపెల్లి మారుతికి బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. మారుతి కరీంనగర్ సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంతో పాటు మరో రెండు ఆలయాలకు ఈవోగా ఉన్నారు. కాళేశ్వరం ఈవోగా ఉన్న మహేశ్ మార్చి 13 వరకు 15 రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో పాటు శివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఈ తాత్కాలిక నియామకం చేపట్టారు.

అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు ఛైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డాగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

5-6 నెలల తర్వాత..

ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతుబంధు, దళితబంధు వంటి పథకాలు



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.

ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింద"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీల చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

ఎల్ఆర్ఎస్‌పై
బీఆర్ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

బయట పడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించక పోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్‌ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలేరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్ పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎన్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రజాపాలన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ మోహన్


మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రం ప్రారంభిస్తున్న కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, మార్చి, 4 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఏర్పాటు చేసిన సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజాపాలన సేవా కేంద్రాలను పట్టణంలోని 6వ వార్డులోని అంబేద్కర్ సంఘ భవనం, 10వ వార్డులోని రెడ్‌క్రాస్ బిల్డింగ్, 15వ వార్డులోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తు ల్లో ఏమైనా తప్పులు ఉండి పథకాలు అందుకోలేక ఇబ్బందులు పడకుండా సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, సేవా కేంద్రాలు ప్రతీ రోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక అధికారి, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌లు ఉంటారన్నారు. దరఖాస్తులు ఉంటే సేవా కేంద్రాలకు వచ్చి సరిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ అక్షయ్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, నవీన్, ముజీబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యలయంలో సోమవారం ప్రజాపాలన హెల్ప్ డెస్క్ ప్రారంభించినట్లు ఎంపిఓ కృపాకర్ తెలిపారు. గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకలకు సంబంధించిన వివరాలలో ఏమైన సవరణలు ఉంటే హెల్ప్ డెస్క్‌లో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాంప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి


కరపత్రం ఆవిష్కరిస్తున్న గౌడ సంఘ నేతలు

కోరుట్ల, మార్చి 4: ఈ నెల 10న కరీంనగర్ ఉమ్మడి జిల్లా కేంద్రంలో జరుగే గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుట్ల గౌడ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఉత్కం వెంకటి గౌడ్, గౌరవ అధ్యక్షుడు పడాల నారాయణ గౌడ్‌లు కోరారు. మంగళవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంబంధిత కరపత్రాన్ని గౌడ సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆత్మీయ సమ్మేళనం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బొమ్మ కల్ ప్రాంతంలో ఉన్న వీ కన్వెన్షన్ హాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం, కార్యక్రమాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కుంట నారాయణ గౌడ్, పంజాల వెంకటరాజం గౌడ్, సుధవేణి మహేష్ గౌడ్, కంట రాజాగౌడ్, పెరమాండ్ల సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కిషన్‌గౌడ్, రాజం గౌడ్, గోనపల్లి శేఖర్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 10న నిర్వహించే గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో సభ్యులు పాల్గొని విజయవంతం చే యాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకులు పూదరి నర్సాగౌడ్ అన్నారు. సోమ వారం పట్టణంలోని ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో గౌడ సంఘం నాయకులు పడాల నారాయణగౌడ్, చర్లపల్లి చిన్న అంజగౌడ్, జోగినిపల్లి రాజేశ్వర్, నారాయణ, పుల్ల చిన్నయ్యగౌడ్, దేవదాసు, సత్యనారాయణగౌడ్, వెంకట్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి రూ. 50 వేలు అందజేత

పెగడపల్లి, మార్చి 4: మండల కేంద్రంలోని స్వయం భూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన జాల అశోక్‌రెడ్డి- భాగ్యలక్ష్మి దంపతులు సోమవారం రూ. 50 వేలు విరాళం అందజేశారు. అల య అభివృద్ధి మహా శివరాత్రి జాతర ఉత్సవాల విజయవంతానికి గాను తమ వంతుగా రూ. 50 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అశోక్ రెడ్డి దంపతులతో పాటు కమిటీ చైర్మన్ గంగారెడ్డి, పోచయ్య, వెంకటే శం, పార్థసారథి, రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

రాయికల్, ఫిబ్రవరి 4: మంచిర్యాల జిల్లా మందమర్రిలో జరిగిన కరాటే పోటీల్లో రాయికల్ పట్టణానికి చెందిన 12 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ 7వ నేషనల్ లెవల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ జపాన్ సోటోకన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పట్టణానికి చెందిన సుశాంత్, శశాంక్, హంసిత్, దీక్షిత్, కండ్లపల్లి శశాంక్, యశ్వంత్, కె.సాత్విక్, ప్రహర్షిత, శాన్వి, సాహితి, వి.సాత్విక్, శ్రీకృతి, నేహలు స్పారింగ్, కటాస్ విభాగాల్లో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. వీరికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రశంసా పత్రాలు అందజేశారు.

కోరుట్ల : వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వరా గార్డెన్‌లో ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 4వ తెలంగాణ స్టేట్ లెవల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీలలో కోరుట్ల విద్యార్థులు ప్రతిభ కనపరిచి 18 పతకాలను సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ అల్లె రమేష్ సోమవారం తెలిపారు. కటా, కమ్మిటే విభాగంలో సత్తా చాటారు. బీ. అక్షర, ఏ. అక్షర, శ్రీహిత, మనోఙ్ఞ, తేజస్వీని, దుర్గా రోహిత్, విఘ్నేష్, మదిరిమ, అనస్యలు బంగారు పతకాలు, వర్షిక, వాగ్దేవి, శ్రీమహా, రుఫియ, షణ్ముఖ్ తేజ వెండి పతకాలు సాధించారు. నిత్యప్రియ శ్రీ, భాన్సిదర్, రిత్విక్ కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. బంగారు పతకాలు 9, వెండి పతకాలు 06, కాంస్య పతకాలు 3 సాధించిన విద్యార్థులను కరాటే తెంగాణ చీఫ్ వసంత కుమార్ అభినందిం చారు. ఇన్‌స్ట్రక్టర్ రమేష్‌లను పలువురు అభినందించారు.

ఆలయాల పునర్నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, మార్చి 4 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న గుండ్రప్ప శివాలయం, ఊర పోచమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి సోమవారం మండల కేంద్రంలోని రెడ్ స్టార్ ఫ్రెండ్స్ యూత్ వారు 15వేల రూపాయలను విరా ళంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి భువనసుందర్‌రెడ్డివినోద దంపతులు గుండ్రప్ప శివాలయ పునర్నిర్మాణానికి 11వేల 16 రూపాయలను ఆలయ కమిటీ వారికి అందించారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, మార్చి 4 : మండలంలోని కలికోట శివారులో ఆదివారం రాత్రి పేకాటరాయుళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై నవీన్ తెలిపారు. తీన్‌పత్తా ఆడుతున్నట్టు పక్కా సమాచారం రావడంతో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురి నుంచి రూ. 10,500లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎస్సై చెప్పారు.

ఆరు గ్యారంటీల అమలుతో పేదల జీవితాల్లో వెలుగు

వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్


అంబారిపేటలో గృహజ్యోతి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కథలాపూర్, మార్చి 4: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత ఎన్నికల్లో ఇచ్చి వాగ్దానాల మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేసి పేదల జీవితాల్లో కాంగ్రెస్ పార్టీ వెలుగులు నింపనుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంబారి పేటలో గృహజ్యోతి పథకంకు సంబంధించి జీరో బిల్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే ఉచిత కరెంట్ వసతి కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందని గుర్తు చేశారు.

ఇప్పటికే రాష్ట్రంలో ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ. 10 లక్షల పరిమితి పెంచడం, రూ. 500లకే సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. రాబోవు కాలంలో మిగిలిన గ్యారంటీలను అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం దూలూరుకు చెందిన ధర్మేందర్ అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు, మృతి చెందిన గొర్రెలు, మేకలకు రూ. 28 వేల నష్టపరిహారం చెక్కులు గొర్రెల కాపరులకు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముంతాజీబోద్దీన్, ఎంపీపీ జవ్వాజి రేవతి, ఎన్‌పీడీసీఎల్ డీఈఈ తిరుపతి, ఏడీఈ రఘుపతి, ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్, విశ్వతేజ, హరిప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందజేయాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనులు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. సోమవారం పట్టణం లోని అర్బన్ హౌసింగ్‌కాలనీ సందర్శిం చి గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహజ్యోతి పథకాన్ని ప్రజలు స్వదినియోగం చేసుకోవాలని, ప్రజా పాలనలో దరఖాస్తుల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరి గిందన్నారు. గృహజ్యోతిలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ 200 యూనిట్లు ఉచితంగా అందజేయడానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు వార్డు కౌన్సిలర్ ఫర్జానాబేగం షాకీర్ సిద్ధికిలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత, నాయకులు విద్యుత్ ఏడీఈ మనోహర్, ఏఏవో శంకర్, ఏఈలు రవి, అమరేందర్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.


మెట్‌పల్లిలో ప్రారంభిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

రాయికల్: గృహజ్యోతి పథకానికి 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులు అర్హులని విద్యుత్ శాఖ ఏఈ అర్జున్ అన్నారు. రాయికల్ పట్టణంలోని 11వ వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి అర్హులన్నారు. రాయికల్ పట్టణం, మండల వ్యాప్తంగా 12,744 గృహజ్యోతి లబ్ధిదారులు ఎంపికైనట్లు తెలిపారు. మార్చి నెల నుంచి జీరో బిల్లుతో కూడిన విద్యుత్ చీటిని విద్యుత్ అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్ద అందిస్తారని తెలిపారు. రేషన్ కార్డు ఉండి జీరో బిల్లు రానివారు, ప్రజాపాలనలో దరఖాస్తుల సవరణకు, నూతన లబ్ధిదారుల దరఖాస్తుకు రాయికల్ పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో, మండల ప్రజలు ఎంపీడీవో కార్యాలయాల్లోని ప్రజాపాలన కౌంటర్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్, నాయకులు ఎద్దండి దివాకర్, బత్తిని నాగరాజు, పడగల రవీందర్ రెడ్డి, షంషీర్, మొబీన్, భూమయ్య, నరసింహారెడ్డి పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

గృహజ్యోతిని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

కొడిమ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న గృహజ్యోతి పథకాన్ని సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గృహ అవసరాల కోసం 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించు వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వరీరాజేందర్, ఏఈఈ రఘునాథ్, మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సుప్రియరెడ్డి, బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితరెడ్డి, నాయకులు ప్రసాద్, జితెందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, కళ్యాణ్, సన్నీ విద్యుత్ సిబ్బంది రామయ్య, వేణు, శంకర్, తరుణ్, తదితరులు ఉన్నారు.


లబ్ధిదారులు జీరో బిల్లును అందజేస్తున్న ఏఈ, కాంగ్రెస్ నాయకులు

బీజేపీ నాయకుల సంబరాలు

రాయికల్, ఫిబ్రవరి 4: ధర్మపురి అర్వింద్‌కు ఎంపీ టిక్కెట్ కేటాయించిన సందర్భంగా బీజేపీ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో సింగరావుపేట గ్రా మంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. నరేంద్ర మోడీ సుపరిపాలన దేశ ప్రజలంతా కోరుకుంటు న్నారని, నరేంద్ర మోదీని బలపరిచే దిశగా కార్యకర్తలు అందరూ కృషి చేసి నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అ ర్వింద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల మ హేష్, మండల ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ గౌడ్, సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సంఘం కార్యవర్గం ఏర్పాటు

బుగ్గారం మార్చి 4: మండల పద్మశాలి సేవ సంఘం అధ్యక్షులుగా బండారి మహేష్‌ని సంఘ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఇట్టె లక్ష్మీనారయణ, ఉపాధ్యక్షులుగా బంక రాజ కుమార్, జక్కుల సధాకర్, చేటిపేల్లి రాజనర్సు, ప్రధాన కార్యదర్శిగా మామిడాల శ్రీనివాస్ కుమార్, కోశాదికారిగా బాల రాజు, కార్యవర్గ సభ్యులుగా కట్ట తిరుపతి, బుదారపు చంద్రయ్య,జక్కుల రాజయ్య, సలహాదారులుగా గాలిపల్లి మహేష్, శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంటింటా పల్స్ పోలియో పరిశీలన

ధర్మపురి, మార్చి 4: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో ఇంటింటా చిన్న పిల్లలకు పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని జగిత్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. గ్రామంలో 161 చిన్న పిల్లలకు సంబంధిత వైద్య ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కల మందు వేశారు. అలాగే మిగిలి పోయిన ఉన్న చిన్న పిల్లలకు పోలియో చుక్కల మందు వేయించాలని ఆయన కోరారు. అయన హెల్త్‌సూపర్‌వైజర్ ఎల్లంకి శ్రీనివాస్, రాజేశం, ఏఎన్ఎం శారద, అంగన్‌వాడి వర్కర్స్, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ అందజేత

కొడిమ్యాల, మార్చి 4 : మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన చెలుపూరి మొహినిచంద్రయ్యల స్మారకార్థం వారి కుమారులు మహేష్, ప్రశాంత్‌లు సమకూర్చిన బాడీ ఫ్రీజర్‌ను వారు సోమవారం గ్రామపంచాయతీ సెక్రటరీ జి. అజయ్‌కుమార్‌కు అందించారు. సుమారు 55 వేల రూపాయల విలువైన బాడీ ఫ్రీజర్ అందించడంతో గ్రామస్తులు దాతలను అభినందించారు. మాజీ సర్పంచు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లారెడ్డి, గ్రామ ప్రముఖులు ఎల్లయ్య, బుచ్చిరాములు, గోపాల్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బీర్‌పూర్, మార్చి 4: మండలానికి చెందిన పలువురి మృతుల కుటుంబాలను సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు. మండలంలోని రేకులపెల్లి గ్రామానికి చెందిన మేడి చంద్రయ్య అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కొల్వాయి గ్రామానికి చెందిన చల్ల వెంకటేష్ కుమార్తె సాయి శ్రీజ ఇటీవల ఫిట్స్ వచ్చి మృతిచెందగా వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన జక్కుల వెంటేష్‌ను పరామర్శించి ఆరోగ్యపరిస్థితి తెలుసుకు న్నారు. మండల కేంద్రానికి చెందిన బల్మూరి విమల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ,నారపాక రమేష్ ఉన్నారు.

'పంటలు ఎండిపోకుండా చూడండి'

ఎండపల్లి, మార్చి 4 : రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో నీరు లేక ఎండిపోతున్నాయని, నీరు అందించి పంటలను కాపాడాలని మారేడుపల్లి, ముంజంపల్లి రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రైతులందరు కలిసి ఎండిన పొలాలు పరిశీలించారు. ఇప్పటికే రైతులకు వరిపై తెగుళ్లతో అధిక పెట్టుబడి పెట్టామని ఈ సమయంలో నీరు అందక పంట ఎండుతుంటే చావే శరణ్యమని, ఒక రైతు మందు డబ్బాతో పంట పొలంలో నిరసన వ్యక్తం చేశాడు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పంప్‌హౌజ్ ద్వారా మోటర్ల సహాయంతో సాగు నీరు ఇప్పించి ఏ ఒక్క రైతు పొలాలను ఎండిపోకుండా కాపాడిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీటి సమస్యను ప్రస్తుత ఎమ్మెల్యేకు కూడా తెలిపామని, ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకొని పైప్‌లైన్ ప్రారంభించి, పంట పొలాలకు నీరు అందించి రైతులను ఆదుకోవా లని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎర్రం రాజయ్య, పందిళ్ల రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, బొమ్మగాని తిరుపతి, సత్తయ్య రైతులు పాల్గొన్నారు.

శివపార్వతుల శోభాయాత్ర


కథలాపూర్‌లో శివపార్వతులను ఊరేగిస్తున్న స్వాములు

కథలాపూర్, మార్చి 4 : మండల కేంద్రంలో సోమవారం శివపార్వతుల శోభాయాత్ర వైభవంగా జరిగింది. బస్టాండ్ నుంచి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం దాకా ట్రాక్టర్‌లో స్వామివారిని సతీసమేతంగా ఊరేగించారు. అర్చకులు ప్రమోద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు మంగళహారతులతో ఆహ్వానం పలికారు. ఊరేగింపులో స్వాములు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శివస్వాములు, మొలిగె శ్రీనివాస్, చిలువేరి రమేశ్ ఉన్నారు.

నువ్వు సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి


మల్లాపూర్ మండలంలోని నువ్వు పంటను పరిశీలిస్తున్న ఏఈవో సాయిప్రియ

మల్లాపూర్, మార్చి, 4 : రైతులు సాగు చేస్తున్న నువ్వు పంటకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సాయిప్రియ సూచించారు. సోమవారం మండలంలోని రేగుంట, సాతరం గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న నువ్వు పంటను పరిశీలించారు. పలువురి రైతులు సాగు చేస్తున్న పంటకు వేరుకుల్లు తెగులు ఆశించినట్లు గుర్తించారు. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మంకొజెబ్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి భూమి తడిచే విధంగా పిచికారి చేసుకోవాలన్నారు. వరి పొలాలు ఈనిక దశలో ఉన్నందున ముందస్తుగా ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్, టెబు కోనజోల్ 80గ్రాములు లేదా ట్రైసైక్లాజోల్ 400 మిల్లీలుతో పాటు ఏదైనా తెగులు మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పొలంలో పిచికారి చేసుకోవలని, తగ్గపోతే మరో వారం రోజుల్లో మరోకసారి పిచికారి చేసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నిమ్మల జలంధర్, చిన్నారెడ్డి, గంగారెడ్డి, భూమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివి ఫలితాలను సాధించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్, మర్చి, 4 : విద్యార్థులు చదువును భారంగా కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలను సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కో రుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెబుతున్న చదువులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, వంటకాల మెనూ పరిశీ లించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని, పదవ తరగతి పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు జరగబోయే పరీక్షల కోసం సన్నద్ధం కావాలని, దీనికి మంచి నిద్ర, సాత్విక ఆహారం తీసుకోని ప్రణాళికతో చదివితే విజయం సాధ్యమవుతుందన్నారు. మోడల్ స్కూల్లో ఏమైనా సమస్యలు ఉన్నయా అని ఉపాధ్యయ బృందాన్ని అడిగి తెసుకొని సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలని సూచించారు. సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


మోడల్ స్కూల్‌లోని సమస్యలను తెలుసుకుంటున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జాతీయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు

ఎండపల్లి, మార్చి 4 : మండలంలోని చెర్లపల్లి గ్రామానికి చెందిన జింజిపెల్లి శ్రీనివాస్ మహాత్మాజ్యోతిబాపూలే జాతీయ అవార్డు అందుకున్నాడు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ ఏడవ తరగతి తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యం గౌతమ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నాడు. 15 సంవత్సరాలుగా ధర్మారం, వెల్గటూర్, ఎండపల్లి మండలాల పరిధిలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని, ఉన్నత విద్య చదివే విద్యార్థులకు అండగా నిలిచి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు విద్యాభివృద్ధికి కృషి చేసినందుకుగానూ ఈ అవార్డు అందజేసినట్టు జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ తెలిపారు.

ప్రమాదకర స్తంభాల తొలగింపు

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన


స్తంభాలు పక్కకు మార్చిన దృశ్యం

పెగడపల్లి, మార్చి 4: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో నడి రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు తొలగించారు. రోడ్డు వేశారు... స్తంభాలు తీయడం మరిచారు పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో ఫిబ్రవరి 12న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను సోమవారం తొలగించి రోడ్డు పక్కన అమర్చారు.

విద్యార్థుల మాక్ పోలింగ్

భీమారం, మార్చి 4: భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా కొందరు విద్యార్థులు క్యూలో ఉండి ఓట్లను వేశారు. ప్రధా నోపాధ్యాయుడు విక్రమ్‌కుమార్ మాట్లా డుతూ రానున్న లోక్ సభ ఎన్నికల దృష్ట్యా అవగాహన కోసం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

స్టడీ టేబుళ్ల పంపిణీ

జగిత్యాల అర్బన్, మార్చి 4: పట్టణంలోని అరవింద్ నగర్, పురాణిపేట ప్రభుత్వ పాఠశాలలలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవతో ఓఎన్‌జీసీ ద్వారా సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ కాన్పూర్ వారు అభివృద్ధి చేయబడ్డ బ్యాగ్ కం స్టడీ టేబుల్ పంపిణీ సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో గల ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గల ప్రైమరీ విద్యార్థులకు బ్యాగ్ కం స్టడీ టేబుల్‌ని విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు.

పన్నుల వసూళ్లలో వేగం పెంచండి

మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్

రాయికల్, ఫిబ్రవరి 4: పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మేనేజర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కలెక్షన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను, నల్ల పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులపై సమీక్ష నిర్వహించారు.

ఈ కేవైసీపై రైతులకు అవగాహన

కథలాపూర్, మార్చి 4 : పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈ కేవైసీ నమోదు ప్రక్రియపై సోమవారం మండలంలోని బొమ్మెన, పోసానిపేట గ్రామాల్లో ఏఈఓలు వైష్ణవి, శేఖ ర్ రైతులకు అవగాహన కల్పించారు. 1 ఫిబ్రవరి, 2019లోపు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు మాత్రమే ఈ కేవైసీకి అర్హులని అనంతరం పుస్తకాలు పొందిన రైతులకు అవకాశం లేదన్నారు. ప్రస్తుతం పీఎం కిసాన్ పథకం కింద లబ్ధిపొందుతున్న రైతులు మాత్రమే ఈ కేవైసీ ఆన్‌లైన్‌లో చేయించుకో వా లని కోరారు. మండలంలో 57 మంది ఈ కేవైసీ చేయిం చుకోవాల్సి ఉందన్నారు.